




## - నాల్గవ కథ -

పీజీ చేస్తున్న రోజుల్లో ......

మాతో, పొట్ట ఓపెన్ చేసి, చేసే మామూలు ఆపరేషన్లు చేయించేవారు కానీ, లేపరోస్కోపీ జోలికి రానిచ్చేవాళ్ళు కాదు. లేపరోస్కోపీ వల్ల చాలా లాభాలున్నాయి. కోతలు, కుట్లూ ఉండవు.పేషంట్ త్వరగా డిశ్చార్జ్ అయి ఇంటికెళ్ళిపోవచ్చు. పొట్టలోపల టెలిస్కోప్ పెట్టి అవయవాల్ని మోనిటర్ లో చూస్తూ, చేసే లేపరోస్కోపీ ఆపరేషన్లు చెయ్యడానికి నైపుణ్యం కావాలి. అందుకని మాకిప్పుడప్పుడే వద్దనేవాళ్ళు.

వద్దన్న పని మీద మోజుకలగడం ఆడం , ఈవ్ వారసులుగా మన జన్మ హక్కు గనక, పీజీ అయిన వెంటనే ఆ తరహా ఆపరేషన్లు నేర్చుకోవడం కోసమని ఓ ట్రెయినింగ్ కు వెళ్ళాను. అక్కణ్ణుంచి వస్తూ వస్తూ, ఓ లేపరోస్కోపీ సెట్ కూడా తెచ్చుకున్నాను మా వూళ్ళో మొదలెట్టి చేసేద్దామని.

ఇప్పుడైతే అన్ని హాస్పిటల్స్ లోనూ, లేపరోస్కోపీ ఆపరేషన్లు చేస్తున్నారు కానీ, అప్పట్లో అలాంటి సర్జరీలు చేసే డాక్టర్లు, మా వూళ్ళో ఒకళ్ళిద్దరే ఉండేవాళ్ళు . ఆపరేషన్ తాలూకు సామాన్లు , అవీ సైడెక్స్ ద్రావకం లో పెట్టుకుని వేరే నర్సింగ్ హోంలకు కూడా వెళ్ళి వెళ్ళి చేసేవాళ్ళం.

డా. నరసింహం గారని మా వూళ్ళో బాగా పేరున్న సీనియర్ డాక్టర్. ఆ తరం డాక్టర్లు ఎం.బి .బి.ఎస్ కాగానే ప్రాక్టీసు మొదలెట్టేవాళ్ళు. స్పెషలైజేషన్ ఏవీ చెయ్యకపోయినా, అన్ని రకాల ఆపరేషన్లూ అవలీలగా చేసేవారు. పది నిముషాల్లో అపెండిక్స్, ఇరవై నిముషాల్లో సిజేరియన్.... వేగమే కాదు, చాకచక్యంగా కదిలే వేళ్ళూ ...అవన్నీ చూసేందుకు ముచ్చట కలిగిస్తాయి.

సీనియర్ డాక్టర్లలో ఓ గొప్ప గుణమేమిటంటే కొత్తవారిని ప్రోత్సహించడం. ప్రాక్టీసు పెట్టబోయే ముందు ఓ సారి కలిసి వచ్చాను. మూడురోజుల తర్వాత నుండీ, ఏదో ఒక కేసు పంపించడమో, లేదా పేషంట్ ను చూసేందుకు రావాలనో పిలిచేవాళ్ళు. కొన్నాళ్ళలా పిలిచిన తర్వాత, బాగా అలవాటైంది. లేడీ పేషంట్లను చూడాల్సి వస్తే నన్నే పిలిచేవాళ్ళు. ఆపరేషన్లు కూడా పక్కనే ఉండి నాతోనే చేయించేవారు.

ఓ సారి వాళ్ళింట్లో పెళ్ళి జరుగుతుండడంతో వాళ్ళ హాస్పిటల్ ఓ నాలుగైదు రోజులు చూసుకోవాలని అడిగితే, సరేనన్నాను. నాకెటూ గొప్ప ప్రాక్టీసు లేదు. చేతి నిండా పనిదొరికితే అంతకన్నా కావల్సిందేముంది. చాలా ఉత్సాహంగా ఒప్పుకున్నాను. ఎప్పుడూ వెంట ఉండే అత్తగారు, వంటిల్లు వదిలేసి నీ ఇష్టం అంటే కోడలికి కలిగే ఉత్సాహం.

ఆ నాలుగు రోజులూ కేసులన్నింటినీ బాగా డీల్ చేసి ఆయనతో శభాష్ అనిపించుకోవాలి.

ఓ రోజు ఒకామె వచ్చింది. వయసు ముప్పై దాటి ఉంటుంది. సన్నగా ఉంది. దిగులు కళ్ళు, కళ్ళ చుట్టూ నలుపు, లోతుకు పోయిన బుగ్గలు. ఎప్పుడో పదేళ్ళ క్రితం చాలా అందంగా ఉండేదన్న అనుమానం తప్ప పోషణ ఏమాత్రం లేని శరీరం .

కడుపులో నొప్పిగా ఉందని చెప్పింది.

ఆర్నెల్లనుండీ వస్తోందట కానీ, ఇవ్వాళ ఎక్కువగా ఉందని చెప్పింది.

కొంత మంది నొప్పి ఉంటే , అరచి చెప్తారు. కొంతమంది ఎంత నొప్పి ఉన్నా భరిస్తుంటారు. ఆవిడ మొహం మీద చెమటలు అలుముకుని చెంపల పక్కనే జుట్టు తడిసి పోయింది. మొహంతా పాలిపోయి ఉంది. ఊపిరితీసుకోవడం కష్టంగా ఉంది. బిగబట్టుకుని నా ఎదురుగా కూర్చున్నట్లుంది.

“వాంతులు కూడా అవుతున్నాయి.” అన్నాడు పక్కనొచ్చినతను.

పరీక్షలూ , స్కానింగులూ చేసి చూస్తే, ఎడమ వైపు ఓవరీలో ఒక సిస్ట్ ఉంది. పెద్దదే. పెద్ద సైజు బత్తాయి అంత ఉంది. ఓవరీ లో వచ్చే సిస్టులు, కణుతులు గర్భాశయం పక్కనే ఉన్న ఫేలోపియన్ ట్యూబు చివర్న వేలాడుతూ ఉంటాయి. బరువు పెరిగిన కొద్దీ ట్యూబ్ మెలితిరిగిపోయే అవకాశం ఉంటుంది. అలా మెలితిరిగడం వల్ల నొప్పి, వాంతులు వస్తాయి.

మెలితిరిగిన ఆ సిస్ట్ ను తీసేస్తే కానీ ఆమె బాధ తగ్గదు.

ఆపరేషన్ అవసరమనీ, అదీ ఎంత త్వరగా జరిగితే అంతమంచిదనీ చెప్పాను.

“ పిల్లలు స్కూలునుండి వస్తారండీ. ఏదైనా ఇంజెక్షనివ్వండి.” అంది.

అలాక్కాదనీ, ఆమెతో వచ్చిన మనిషిని పిలిపించాను. అతను భర్తేమో అనుకున్నాను కానీ, ఆమె పక్కన కూర్చోకుండా చెప్పండని ఓ పక్కనే నిల్చున్నాడు. ఆమె పరిస్థితి ఎంతో దీనంగా ఉంది అనుకున్నాను. అతనేమో రాణిగారి దగ్గర నమ్మకస్తుడైన పనివాడులా వంగి నిల్చున్నాడు. ఇద్దరికీ విషయం అంతా వివరించాను.

“వదినా, పిల్లల సంగతి లక్ష్మి చూసుకుంటది, అన్నకు ఫోన్ చేసి వస్తా " అని ఆమెకు నచ్చజెప్పి, వెళ్ళి ఓ అయిదు నిముషాల్లో తిరిగొచ్చాడు.

“అన్న ఊళ్ళోనే వున్నాడొదినా. ఓ అరగంటలో వస్తానన్నాడు.”

అన్నట్టుగానే అరగంటలో ఆమె భర్త వచ్చాడు. బాగా పొడగరి, ఎత్తుకు తగ్గ లావు. ఖద్దరు చొక్కా, పేంటూ. మెడలో ఆమె మంగళ సూత్రంకన్నా మందపాటి గొలుసు. ఆకుపచ్చ కళ్ళద్దాలు. ఒక్కడే కాదు. వెంట నలుగులు బలమైన వ్యక్తులున్నారు.

"డాక్టరమ్మ" అంటూ నన్ను పరిచయం చేశారు.

ఆయనక్కూడా విషయం అర్థమయేట్టు వివరించి, వెంటనే ఆపరేషన్ చెయ్యకపోతే లోపలి సిస్ట్ పగిలే ప్రమాదముందని చెప్పాను

నా వంక ఓ సారి చూసి ఏం అనకుండా అటూ ఇటూ చూశారు.

"నరసింహం గారు లేరా?" అడిగాడు.

"అబ్బాయి పెళ్ళట . కాస్త అడావుడిగా ఉన్నారు. ఆపరేషన్ టైముకు వస్తారంట." ఎవరో అన్నారు.

"సరే. జాగ్రత్తగా చెయ్యండి. నువ్వుంటావుగా?" అని ఆమె తో పాటొచ్చిన లక్ష్మణుడిలాంటి వ్యక్తినడిగారు.

“అన్నా, ఉంటానన్నా.”అన్నాడు వినయంగా.

భార్య ఉన్న రూం లోపలికెళ్ళాడు.

ఆయనతో ఉన్న పదిమందీ కూడా లోపలికి వచ్చారు. లోపల బెడ్ మీద ఉన్న భార్యతో "డాక్టరమ్మతో మాట్టాడాను. కంగారులేదులే, రాత్రికి వస్తాను." అన్నాడు.

"పిల్లలు స్కూలుకెళ్ళారు." ఆమె నీరసంగా చెప్పింది భర్త తో.

అతను పక్కనున్న మనిషి వంక తలతిప్పి చూశాడు.

"నేను మా యావిణ్ణి సూసుకోమన్నా వదినా. నీకేం బెంగలేదు." అన్నాడు అతను.

అయినా ఆమె కళ్ళల్లో దిగులు రవ్వంతకూడా తగ్గలేదు.

పదిమంది ముందు భార్యతో మాట్లాడే అలవాటులేకేమో, అతను అసౌకర్యంగా కదిలాడు.

"మరి వస్తాను. పిల్లల సంగతి ఈడు జూసుకుంటాళ్ళే. " అన్నాడు.

నావైపు తిరిగి " ఇంటికెప్పుడు పంపిస్తారు ?" అడిగాడు ఆమె భర్త

"మామూలుగా ఐతే మూడునాలుగు రోజుల్లో వెళ్ళిపోవచ్చు. "

"మరింకేం. రెండ్రోజుల్లో ఏం మునిగిపోద్ది."

ఆమె అర్భకంగా మధ్యతరగతి గృహిణిలా ఉంది. ఆయన చూస్తే బాగా పలుకుబడి తో పంచాయితీలు చేసే మనిషిలా ఉన్నాడు.

మా పనులు మేము మొదలెట్టాము. చెయ్యబోయే ఆపరేషన్ గురించి, మత్తు గురించి వివరాలు చెప్పి అనుమతి పత్రాలమీద సంతకాలు తీసుకున్నాం.

డా. నరసింహం గారికి ఫోన్ చేసి కేసు వివరాలు చెప్పి, పేషంట్ భర్త తో కూడా మాట్లాడించాను. ఆపరేషన్ టైముకు ఆయన వస్తానని చెప్పాక, "చాలా ముఖ్యమైన పనుందనీ, రాత్రికి వస్తాను' అంటూ పరివారం తో ఆయన వెళ్ళిపోయాడు.

ఆపరేషన్ థియేటర్ లోపలికి తీసుకెళ్ళే సరికి మధ్యాహ్నం నాలుగైంది.

పెళ్ళి హడావుడిలో ఉన్నా గానీ, డా. నరసింహంగారు ఆపరేషన్ టైముకు వచ్చారు. .

" ఓపెన్ చేసేద్దాం." అన్నారు.

"సార్, ఓపెన్ చెయ్యడం ఎందుకూ, లేపరోస్కోపీ చేద్దాం. రెండు మూడురోజుల్లో ఇంటికి వెళ్ళిపోతుంది."

సరే కానీయమన్నారు. .

మోనిటర్ లో అవయవాల్ని చూస్తూ చేసే ఆపరేషన్ మొదలెడితే, థియేటర్ లో స్టాఫంతా సినిమా చూస్తూ నిలబడతారు. ఎనస్థీషియా డాక్టర్ తో సహా. మిగతా లైట్లన్నీ ఆఫ్ చేస్తాం కాబట్టి నిజంగానే సిన్మా హాలు వాతావరణం ఉంటుంది. చూసే వాడికి చేసేవాడు లోకు వన్నట్టు చూసేవాళ్ళందరూ నాకు సలహాలిస్తున్నారు.

"మేడం , అలా ....వెళ్ళి దాన్ని పంచర్ చెయ్యండి."

"ఈ గ్రాస్పర్ వాడండి మేడం , ఈజీగా పట్టేసుకోవచ్చు."

" రైట్ నుండి వెళ్తే బెటర్ మేడం."

"ఆ తర్వాత దాంట్లో నీరంతా లాగేసి ...ఆ పళాన ..."

వాళ్ళు చెప్పినట్లు వెళ్ళకపోయానో " ప్చ్ ...అరె ..అబ్బా... " అంటున్నారు. వాళ్ళలో అసహనం డోసెక్కువైతే నిట్టూర్పులు విడుస్తున్నారు.

వాళ్ళంతా నాకన్నా సీనియర్లు. కొమ్ములు తిరిగిన కాంపౌండర్లు . డాక్టర్ గా అప్పటికి నాకింకా కొమ్మే మొలవలేదు. 'మీరంతా కాస్త నోర్మూసుకుంటారా' వాళ్ళని అరవలేక నేనే నోరుమూసుకుని చేస్తున్నాను.

ఎనస్థీషియా డాక్టర్ సుబ్బయ్య గారు కూడా బాగా ఇన్వాల్వ్ అయిపోయి, తననుకున్నట్లు నేను చేస్తుంటే 'ఓహ్.. లవ్లీ' అంటున్నారు. నేనేదైనా వదిలేస్తే, అర్రెర్రె అంటున్నారు.

ఇంతకూ చేసిందేవిటంటే, ఒకరు టెలిస్కోప్ తో చూపిస్తుండగా మెలితిరిన ట్యూబ్ ని పట్టుకుని దాన్ని కట్ చేసి , ఆ ట్యూబ్ కు వేలాడుతున్న సిస్ట్ ను బయటకు లాగెయ్యడం.

మొత్తానికి ఓ గంట, గంటన్నరలో సర్జరీ అయింది. అంతా సవ్యంగా జరిగినందుకు ఆంజనేయస్వామికి మనసులోనే ఓ కొబ్బరికాయ కొట్టేసుకున్నాను.

డా. నరసింహం గారు దగ్గర కొచ్చి, " కంగ్రాచులేషన్స్ అమ్మా, చాలా బాగా చేశావు. నేను కూడా ఓ లేపరోస్కోపీ సెట్ తీసుకుంటాను. ఈ సారి కేసేదైనా వస్తే చేద్దాం." అన్నారు.

"థాంక్యూ సార్"

ఆపరేషన్ జరుగుతున్నంత సేపూ, డా. నరసింహం గారికి ఇంటిదగ్గర్నుండి ఫోన్లు వస్తూనే ఉన్నాయి. ఇదిగో వస్తున్నా, అదిగో వస్తున్నా అంటూ ఆయన ఆపరేషన్ అయేవరకూ ఉన్నారు.

డా. సుబ్బయ్య గారు ఆమె ఎనస్థీషియా నుండి రికవర్ కావడానికి అవసరమైన ఇంజెక్షన్లిస్తున్నారు. స్టాఫంతా ఆయనకు కావల్సినవి అందిస్తున్నారు.

మోనిటర్ మీద ఆమె పల్స్, బీపీ ఒక సారి చూసి , సంతృప్తిగా తలాడించి నాతో

"సరేనమ్మా, వీళ్ళు తిరుపతి ప్రోగ్రాం పెట్టారు. నేను బయల్దేరాలి" అంటూ ఎనస్థీషియా డాక్టర్ గారితో "సుబ్బయ్యగారూ జాగ్రత్తగా చూసుకోండి. షిఫ్ట్ చేసేవరకూ మీరు ఉండి వెళ్ళండి" అంటూ ఆయన వెళ్ళిపోయారు.

నాకు నేను విజయోత్సాహంతో ఓ మాదిరి బరువైన కిరీటం పెట్టుకుని, అది మోస్తూ థియేటర్ లో కూర్చున్నాను.

'ఇలాంటి కేసులు ఇంకా చెయ్యాలి.'

'బాగా పేరుతెచ్చుకోవాలి.'

'నా పేరు మారుమోగిపోవాలి.'

ఆపైన ...

ఆ తర్వాత ...

అటు పిమ్మట...

ఇంకా రాస్తే బాగోదులెండి.

అలా కొన్ని ఉన్మాదపు ఆలోచనల్లో కొట్టుకుపోతుండగా, డా. సుబ్బయ్య గారు "ఏయ్ అరుణా, లే...లే" అంటూ పేషంట్ చెంపలు తడుతున్నారు.

ఎనస్థీషియా నుండి రికవర్ చేసేప్పుడు అలా అరవడం మామూలే.

నేను స్టూల్ మీంచి లేచి పేషంట్ దగ్గరగా వెళ్ళాను.

ఆయన పేషంట్ చెంపలు తట్టడం బదులు చెంపలు వాయిస్తున్నట్లనిపించింది.

ఎనస్తీషియాకూ, ఫ్లైట్ టేకాఫ్ , లాండింగ్ కూ చాలా పోలికలున్నాయనిపిస్తుంది. ఒక్కో సారి పేషంట్ మత్తులోపలికి వెళ్ళడం, మళ్ళీ తిరిగి బయటకు రావడం చాలా స్మూత్ గా జరుగుతుంది. ఎనస్తీషియా డాక్టర్లను చూస్తే నిజంగా ముచ్చటేస్తుంది.

మనం నిద్రపోతున్నప్పుడు, నిద్రాభంగం కానీయకుండా లేండింగ్ చేసే పైలట్ ను చూస్తే కలిగే ముచ్చట.

పది నిముషాలయ్యింది. పేషంట్ మత్తులోంచి బయటకు రావడం లేదు. డా. సుబ్బయ్య గారు అసలేం మాట్లాడడం లేదు. గంభీరంగా ఉన్న ఆయన మొహం చూస్తే అసలేం అడగాలో అర్థం కాలేదు.

“సర్ , ఏమిటీ ప్రాబ్లెం?”

తల కొద్దిగా ఊపి “వన్ మినిట్” అన్నారు.

ఆయన పని చేసుకుంటుంటే ఎక్కువగా డిస్టర్బ్ చెయ్యకూడదు కదా అని కాసేపు అలానే చూస్తూ నిల్చున్నాను. నర్స్ ని పిలిచి చాలా నెమ్మదిగా మాట్లాడుతున్నాడాయన. పేషంట్ పక్కన నించున్న నాక్కూడా వినబడనంత.

"ఏమైనా ప్రాబ్లమా?" అడిగాను.

"ఏం లేదు, మీరెళ్ళి కాఫీ తాగేసి రండి. బాగా టైరయ్యారు" అన్నారు డా. సుబ్బయ్య గారు, కళలేని మొహాన్ని నవ్వుతో మేకప్ చేసుకుంటూ.

ఆయనకు ఏసీ థియేటర్ లో చెమటలు పడుతున్నాయి.

పేషంట్ ఎనస్తీషియా లోంచి బయటికొస్తే నేను బయటికెళ్ళే అర్హత వస్తుంది. ‘అప్పుడేకదా, ఆపరేషన్ బాగా అయింది.’ అని చెప్పగలిగే ధైర్యం వస్తుందీ.

డా. నరసింహం గారు బయటికెళ్ళిపోవడం గమనించిన పేషంట్ బంధువులు ఆపరేషన్ థియేటర్ ముందు గుమిగూడారు. వాళ్ల మాటలు వినిపిస్తున్నాయి.

మామూలుగా అయితే పదినిముషాల్లో పేషంట్ ఎనస్థీషియానుండి బయటికి వచ్చేయాలి. అలాంటిది అలా అలా ఎదురుచూస్తూ ఉంటే అరగంట ..ముప్పావుగంట గడిచిపోయింది.

డా. సుబ్బయ్య గారు, ఇదిగో అయిపోయింది వచ్చేస్తోంది అంటున్నా, పేషంట్ లో కదలిక లేదు. మోనిటర్ లో పల్స్ , బీపీ మాత్రం స్టేబుల్ గా ఉన్నాయి. అదొక్కటే ఊరట కలిగిస్తున్నా, ఆమె స్పృహ లోకి రాకపోవడంతో కంగారు మొదలైంది.

బయట గొడవ వినిపించింది.

ఇంక నేను బయటికి వెళ్ళి ఏదో ఒకటి చెప్పాలి.

స్టాఫ్ వచ్చి 'పేషంట్ భర్త వచ్చాడనీ , మిమ్మల్ని కలవాలంటున్నాడనీ' చెప్పారు.

కడుపులో టెన్షన్ ను, భయం కవ్వం తో గజిబిజిగా చిలికేస్తోంది.

డా. నరసింహం గారు ఈ పాటికి వెళ్ళిపోయి ఉంటారు అప్పటికింకా మొబైల్స్ ఫోన్ వాడడం మొదలైంది కానీ నాకైతే మొబైల్ ఫోన్ లేదు. నరసింహం గారిదగ్గర కూడా లేదనే గుర్తు.

‘ఏదైతే అదైంది. ఉన్నవిషయం చెప్పేద్దాం. ఏ పరిస్థితుల్లోనైనా సరే సత్యమే కాపాడుతుంది.’ అనుకుని బయటికెళ్ళాను.

లోపలుంటే టైం తెలియలేదు కానీ బయటికొచ్చి చూస్తే, చీకటి పడుతోంది. బయట ఎలెక్ట్రిక్ లైట్లు వెలుగుతున్నాయి. హాస్పిటల్ ఆవరణలో చెట్ల మీద పక్షులు ఇళ్ళకు చేరుతున్నాయి. వరండా నిండా మనుషులు.

వరండాలోంచి ఓ పక్కగా ఉన్న డాక్టర్ రూం లోకి వెళ్తే అంతా నావెనుకే వచ్చారు. . ఆయన వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. ఆయన చుట్టూ అనుచరులు చేతులు కట్టుకుని నిల్చున్నారు.

ఉన్నవిషయం చెప్పాను.

“ ఆపరేషన్ అయిపోయింది. మత్తులోనుండి బయటకు తీసురావడంలో కొంత ఇబ్బంది వచ్చింది. టైం పడుతోంది. ఎనస్థీషియా డాక్టర్ గారు ప్రయత్నిస్తున్నారు.” అన్నాను.

“ఆపరేషన్ లో ఏదైనా తేడా జరిగిందా?”

“అసలు మిషన్ ఆపరేషన్ వల్లేనా ఈ సమస్య?”

“ఎప్పటికి బయటికొస్తారో చెప్పండి.”

“హైద్రాబాద్ తీసుకెళ్ళమంటారా?”

“ఎవర్నైనా పెద్ద డాక్టర్లని పిలిపించండి.”

“ఖర్చు కు వెనకాడొద్దు.”

ప్రశ్నలు, అనుమానాలు, సలహాలు అన్నీ ఒకేసారి కుమ్మరించారు.

బాగా పెద్ద సమస్య ఎదురైనపుడు, అప్పటికప్పుడు ధైర్యం కూడా అదే రేంజ్ లో పెరుగుతుంది. అన్నింటికీ తెగించిన ధైర్యం . ఆ ధైర్యంతోనే జవాబులు చెప్పాను

“ అసలు బతికే ఉందా?”

సినిమాల్లో చూపెట్టినట్లు మేముకూడా ప్రాణం పోయినా ఏదో నాటకాలాడుతున్నామనుకుంటున్నాడేమో.

“అయ్యో అదేం లేదు . గుండె కొట్టుకోవడం, బీపీ స్టేబుల్ గా ఉన్నాయండీ. కాకపోతే స్పృహ ఎప్పుడొస్తుందో తెలియడం లేదు.”

“-----------------.”

“మామూలుగా అయితే వెంటనే బయటికొస్తారు. తనవిషయం లో లేటయ్యింది. కారణం ఇదీ అని చెప్పలేము. ప్రయత్నం చేస్తున్నాము.” చెప్పాను.

“ఒక వేళ రాకపోతే…”

...... అతనడిగిన ప్రశ్నకు నా దగ్గర జవాబులేదు,

తలవంచి ఆలోచనలో ఉన్నాడు. కళ్ళు మాత్రమే పైకెత్తి నావంక చూశాడు. ఎర్రటి కళ్ళు.... ఆచూపు....చుట్టూ అతని మనుషులు. నా ధైర్యం ఒక్క సారిగా పారిపోయింది.

“మజ్జాన్నమెప్పుడో ఆపరేషన్ చేశావు. ఇంతవరకు పేషంటుకు ఉలుకూ పలుకూ లేదు.”

పక్కనున్నతను అసహనంగా అరిచాడు. మా స్టాఫు, వాళ్ళవాళ్ళల్లో కొంతమంది అతన్ని పక్కకు తీసుకెళ్లారు.

ఓసారి డా. సుబ్బయ్య గారు కూడా బయటికి వచ్చి వాళ్ళతో మాట్లాడారు.

"మత్తులోంచి ఎందుకు రికవర్ కావడం లేదో అర్థం కావడం లేదు. అవసరమైన రక్త పరీక్షలన్నీ పంపించాను. వాటి రిపోర్ట్ రాగానే ఓసారి చూసి మీతో మాట్లాడతాను. అప్పటివరకూ ఐసియు లో పెడదాము" అంటూ గొంతులో ట్యూబులు అవీ ఏమీ కదిలించకుండా ఆపరేషన్ థియేటర్ నుండి ఐ సి యు కు షిఫ్ట్ చేశారు.

పేషంట్ తాలూకు బిపి, పల్స్, వగైరా అన్నీ బాగానే ఉంది కానీ స్పృహ రాలేదు.

ఐ సి యు కు మార్చిన తర్వాత నర్స్ తో మాట్లాడుతూ ఆయన నోట్స్ వ్రాశారు. నర్సులకూ , డ్యూటీ డాక్టర్ కూ చెప్పాల్సినవి చెప్పి, నాదగ్గరకొచ్చాడు.

నేను ఆత్రంగా చూస్తుంటే "చూద్దామండీ, ఇప్పుడప్పుడే ఏం చెప్పలేం, వెయిట్ చెయ్యడం తప్ప. సరే... నాకు వేరే కేసులున్నాయి. మళ్ళా వచ్చి చూస్తాను."

"సర్, మరి పేషెంట్.....?"

" అన్నీ స్టేబుల్ గా ఉన్నాయి. ఇవ్వాల్సిన ట్రీట్ మెంట్ అంతా అయిపోయింది. ఇహ అంతా జస్ట్ వెయిట్ అండ్ వాచ్. నేను నైట్ కు వచ్చి చూస్తాను."

అప్పటికి రాత్రి ఎనిమిదవుతోంది.నర్సులు డ్యూటీ మారారు. వాళ్ళ గుసగుసలు వినిపిస్తున్నాయి. కాసేపటికి వచ్చి

"గుడీవినింగ్ మేడం . ఏమైనా తెప్పించమంటారా ?" అడిగారు.

"అహ ఏం వద్దు."

ఇంటికి ఫోన్ చేసి "వెంకమ్మా, బాబు కు భోజనం పెట్టు. తోడు పడుకో." అని చెప్పాను.

ఆమె పిల్లలు గుర్తొచ్చారు.

అమెరికా నుండి ఒక డాక్టర్ గారు, పూనే నుండి వాళ్ళ బావమరిది ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. వాళ్ళ నంబర్లిచ్చి ఎప్పటికప్పుడు విషయాలు తెలియజేస్తుండమన్నారు. లోకల్ ఎమ్మెల్లేగారు కూడా ఫోన్ చేసి, పేషంట్ ను జాగ్రత్తగా చూసుకోమని , ఎలాంటి సహాయం కావాలన్నా వెంటనే సంప్రదించమనీ చెప్పారు. పేషంట్ భర్త పంపించిన గవర్నమెంట్ డాక్టర్లు వచ్చి చూసి వెళ్ళారు.

కొంతమంది స్నేహితులైన డాక్టర్లు విషయం తెలిసి కేసు చూడడానికి వచ్చారు.

కేసు చూసిన తర్వాత, ట్రీట్ మెంట్ చార్ట్ చూశారు.

"అంతే , ఇంతకన్నా ఎవరమైనా ఏం చెయ్యగలం?"

"మీరేం వర్రీ అవకండి మేడం. మనమేమైనా దేవుళ్ళమా ప్రాణాలు నిలపడానికి."

"ఎందుకమ్మా ఈ లేపరోస్కోపీలూ . అవన్నీ ఫాన్సీ సర్జరీలమ్మా, వాటి బదులు మామూలు సర్జరీ చేస్తే పోయేది."

"జస్ట్ వెయిట్ అండ్ వాచ్."

"కాపోతే అన్నింటికీ రెడీ గా ఉండండి."

"అన్నింటికీ అంటే?"

"పేషంట్స్ ఈ మధ్యన బాగా డిమాండ్ చేస్తున్నారండీ. అప్పటికప్పుడు కావాలంటున్నారు. ఏదైనా హెల్ప్ కావాలంటే మొహమాటపడొద్దు. మాకు కాల్ చెయ్యండి వెంటనే అరేంజ్ చేస్తాము."

"మొన్నటికి మొన్న లలితగారి కేసు బాదయినప్పుడు ఎక్కణ్ణుంచి వచ్చారో జనం అమాంతంగా వచ్చిపడ్డారు. జస్ట్ హాఫ్ యాన్ అవర్ లో అంతా నాశనం చేశారు."

'డా. నరసింహం గారి హాస్పిటల్. ఏద్దైనా అయితే నేనేం చెప్తాను ఆయనకు. హాస్పిటల్ చూసుకోమని అప్పజెప్పివెళ్తే ఇదా నేను చేసే ఉపకారం. దేవుడా. ఎక్కడున్నావయ్యా?"

నా టెన్షన్ కాస్త తగ్గిద్దామని కాబోలు,

"పాపెం చేస్తుందీ, బాబు ఎన్నో క్లాసూ?" అంటున్నారు.

శక్తి కూడగట్టుకుని వాళ్లడిగిన వాటికి సమాధానాలు చెప్తున్నాను.

వాళ్లతో మామూలు పిచ్చాపాటీ సంభాషించడం ప్రాణం మీదకొస్తోంది.

కాసేపటికి అందరూ వెళ్ళిపోయారు.

అరగంట కోసారి వెళ్ళి చూసి వస్తున్నాను. పరిస్థితిలో ఏమాత్రం తేడా లేదు.

సాయంత్రం చెట్ల మీద గోల గోల చేసిన పక్షులు కూడా నిద్రలు పోతున్నట్టున్నాయి. ఆవరణలో దీపాల వెలుగు, రోడ్ మీద అప్పుడప్పుడూ వెళ్ళే ఒకటి రెండు వాహనాల శబ్దం తప్ప హాస్పిటల్ అంతా నిశ్శబ్దంగా ఉంది.

'రేపేమవుతుందో... '

టేబిల్ మీద తల ఆనించి ఆలోచిస్తున్నాను.

------

-------..

నర్సొచ్చి కంగారుగా పిలిచింది.

వెళ్ళి చూస్తే , ఆమె బీపీ , పల్స్ వేగంగా పడిపోతున్నాయి.

అనుకున్నంతా జరిగింది.

అతను, అతని బంధువులు దాడికి దిగారు. అందిన వస్తువులు అందినట్లు విసిరేస్తున్నారు. ఐసియు లో ఇంకా చాలా మంది పేషంట్లున్నారు. వాళ్ళకు తగిలితే ? అంత ఖరీదైన పరికరాలు పాడైతే ఎంత డబ్బు నష్టమో, మళ్ళీ వాటిని తెప్పించడానికి ఎంత కాలం పడుతుందో?

నేను కనిపిస్తే వాళ్ళ ఆవేశానికి అంతుండదనీ, నన్నేమైనా చేస్తారనీ స్టాఫ్ నన్ను వేరే దారిలో పంపించేశారు. ఐసియు కాబట్టి , నా చెప్పులు బయటే విడిచాను. వట్టికాళ్ళతో నడుస్తున్నాను. అదంతా బాగా ముళ్ళబాట. చీకటి. , రాళ్ళూ రప్పలు, ఎటో అటు నడుస్తూ వెళ్తే ఏదో దారితగలక పోదు అంటూ నడుస్తున్నాను. ఏదో మెత్తటి దాని మీద అడుగేశాను. కాలు జారిపోయేంత మెత్తగా ఉంది. వళ్ళు జలదరించింది.

చీకట్లో ఎవరో నా భుజం గట్టిగా పట్టుకున్నారు. బిగుసుకుపోయాను.

మెలకువ వచ్చింది.

'అబ్బ, ఎంత చెడ్డ కల, నిజంగా జరిగినట్టే ఉంది.'

నిజంగానే నర్సు నా భుజం పట్టుకుంది. నేను పలకకపోవడంతో నర్స్ మరింత కంగారుగా భుజం పట్టుకుని ఊపేస్తూ, "మేడం ఆమె కండిషన్ సీరియస్ గా ఉంది. త్వరగా రండి " అంది.

'ఏంటీ కల నిజమవబోతోందా ?"

లోపలికి పరిగెత్తాను.

"సుబ్బయ్య గారికి ఫోన్ చేశారా?" అడిగాను.

" చేశాము. ఈపాటికి వస్తూ ఉంటారు."

లోపలికెళ్ళి చూస్తే ఆమె బెడ్ మీద ఉన్న ఆమె పెద్దగా మూలుగుతోంది. వినడానికి భయంకరంగా ఉంది. బెడ్ మీద నిలబడకుండా గింజుకుంటోందని ఆమె చేతులవీ బెడ్ కు కట్టేశారు.

ఆమెను బెడ్ మీద నిలపడానికి, స్టాఫ్ మొత్తం నానా తంటాలూ పడుతున్నారు.

అంతలో సుబ్బయ్య గారు వచ్చారు.

ఫోన్ చేసిన నర్స్ ఎదురెళ్ళి కంగారుగా " సార్ వచ్చారు.. వచ్చారు" అంది.

కాసేపు ఆయన బెడ్ పక్కన నిల్చుని "అందరూ కాసేపు పక్కన నిలబడండి. దూరంగా ఉండండి." అన్నారు.

"ఎవరూ నాకు ఫోన్ చేసింది?"

"నేనే సార్" అంటూ పిల్లనర్సు ముందుకొచ్చింది.

"ఎందుకే దిక్కుమాలినదానా, పేషంట్ సుబ్బరంగా ఉంటే అంత కంగారు పెట్టావూ!" అంటూ సంతోషంగా ఆపిల్ల తలమీద మొట్టారు.

ఆమె స్పృహలోకి వచ్చింది. గొంతులో ట్యూబులూ, అవీ భరించలేక గోల చేస్తోంది.

మెల్లగా వాటినన్నింటినీ తీసేశారు.

ఆ నిముషంలో నేననుభవించిన రిలీఫ్ జీవితంలో ఎప్పుడూ కలగలేదు. అమ్మయ్య, ఇక చచ్చిపోయినా పర్లేదనిపించింది.

బయటికొచ్చి చూస్తే ఆమె భర్త ఓ బెంచీ మీద రెండు చేతులూ బెంచీ మీద చెరోపక్కన ఆనించి, తలవంచుకుని కూర్చుని ఉన్నాడు. అనుచరులంతా వరండాలో అడ్డదిడ్డంగా పడుకుని గురకలు తీస్తున్నారు.

ఆ టైం లో ఆయన అక్కడుంటాడని నేనూహించలేదు.

నన్ను చూసి లేచాడు. అప్పుడే తెల తెలవారుతోంది. ఒకటో రెండో పక్షులు నిద్రలేచినట్లున్నాయి.

"ఆమెకు స్పృహ వచ్చిందండీ. ఇప్పుడు బాగానే ఉన్నారు. చూస్తారా?" అంటూ లోపలికి తీసుకెళ్ళి చూపించాను.

ఆమె పక్కనే నిల్చుని "పిల్లలు బాగానే ఉన్నారు" అంటూ ఆమెకు కావల్సిన సమాధానం చెప్పాడు.

బయటికి వచ్చిన తర్వాత అంత భారీ మనిషీ, గోడకానుకుని , జేబులోంచి కర్చీఫు తీసి కళ్ళు తుడుచుకున్నాడు. ఎర్రటికళ్ళల్లో నీళ్ళు.

కనిపించేవన్నీ రాళ్ళు కాదనీ, రాళ్ళల్లో కూడా నీళ్ళుంటాయనీ అసలనుకోలేదు.

"ఇలా అవుతుందని మేమూ అనుకోలేదండీ. మిమ్మల్ని టెన్షన్ పెట్టినందుకు సారీ" అన్నాను.

"అయ్యో, ఊరుకోండీ!" అంటే ఇంకా ఎక్కువగా కారిపోతున్నాయి.

కాసేపటికి ఆయనకి ఆయన సంబాళించుకున్నాడు.

★★★★★★★★

నేనింటికి రాగానే మా అబ్బాయి , ఆరేళ్ళుంటాయేమో అప్పటికి ,

బెడ్ మీద కూర్చుని డ్రాయింగ్ బుక్ లో రంగు పెన్సిళ్ళతో బొమ్మ కు రంగులేస్తున్నాడు.

నన్ను చూడగానే అమ్మా అంటూ వచ్చాడు.

స్నానం చెయ్యాలంటున్నా సరే వినకుండా చంకెక్కాడు.

వాణ్ణి మొయ్యలేక ఓ చోట కూర్చున్నాను.

“అమా, నేను ఇవాల స్కూలు పోను .”అన్నాడు నావళ్ళో సర్దుకుని కూర్చుంటూ

“ఏం?”

“నిన్న నువు రాలేదుగా , ఓంవర్క్ సెయ్యలేదు.”

“సరేలే.”

“రాత్తంతా ఎక్కదున్నావ్”

“ఓ పేషంట్ కు బాగోపోతే అక్కడే కూర్చున్నా.”

“రాత్తంతా కూసుంతే ఎక్కవ దబ్బిస్తారు కదా!”

“కూసుంతే కాదు, కూర్చుంటే అను…”

వీడికి నత్తి ఎప్పుడు పోతుందో.

“నాకు తెలుసు. శానా …దబ్బులిచ్చి ఉంటారు. అందుకేగా యాపీగా ఉన్నావు.”

“ఎవరు చెప్పారు అలా?”

“నేచెప్పలేదమ్మా… బాబుకే ఎంత తెలివో?” అంటోంది. వెంకమ్మ టేబిల్ మీద ఇడ్లీలున్న బౌల్ పెడుతూ.

“దబ్బు చూత్తా" అంటూ నా బాగ్ తెరవబోతున్నాడు.

“డబ్బులేదు, ఏం లేదు. నేనొచ్చేసరికి నువ్వు స్కూలుకెళ్ళిపోతావనుకున్నా. నువ్వింట్లోనే ఉన్నావుగా. అందుకని హాపీ.”

వాడి బూరి బుగ్గల్ని పిండలేక, హెల్ప్ లెస్ గా నిమురుతూ చెప్పాను.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments